క్లుప్తంగా

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ పురోగతి సూచికపై ఏఎస్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంటులకు శిక్షణ ఇచ్చారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ జయ ఉమ ఈ శిక్షణ ఇచ్చారు. పంచాయతీ పురోగతి సూచికలో అవార్డులు పొందేందుకు గాను ప్రశ్నలకు సమాధానాలు రాయడంపై వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మీనా కుమారి, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం, ఎంఈవో రమణ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయానికి దివీస్ వితరణ



సచివాలయ సిబ్బందికి కంప్యూటర్, ప్రింటర్ అందిస్తున్న దివీస్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ గ్రామ సచివాలయానికి దివీస్ లేబొరేటరీ బుధవారం రూ.71,500 విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్ అందించారు. సచివాలయ కార్యదర్శి రామారావుకు దివీస్ సీఎస్ఆర్ ప్రతినిధి ఎ.శ్రీనివాస్ దీనిని అందజేశారు. గ్రామ పంచాయతీకి చెందిన సమగ్ర సమాచారం పొందుపరచడానికి ఇవి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో దివీస్ ప్రతినిధి కె.నరసింహ, పంచాయతీ ప్రతినిధులు వెంపాడ సూరిబాబు, చుక్క శివాజీ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో విశాఖ కేంద్రంగా 'ఇసాయ్ ఫార్మా జీసీసీ'

కొమ్మాది: ఔషధ పరిశ్రమ ఇసాయ్ ఫార్మా త్వరలో విశాఖ కేంద్రంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఏర్పాటు చేయనుందని ఇసాయ్ ఫార్మా అంతర్జాతీయ ప్రతినిధి మకోటో హోకేట్సు తెలిపారు. దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఇసాయ్ ఫార్మా ప్రతినిధి బృందంతో ఆయన బుధవారం గీతంను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఔషధ రంగంలో మార్పు దిశగా తమ సంస్థ ప్రణాళికలు రూపొందించిందని, అందులో భాగంగా విశాఖలో జీసీసీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీనికి అవసరమైన మానవ వనరులు, పరిశోధనా సహకారానికి గీతంతో కలసి పని చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎం. శ్రీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవానిపాలెంలో చోరీ

కొమ్మాది: ఇంటి వద్ద రాత్రిపూట పార్క్ చేసిన కార్ల అద్దాలు పగలగొట్టి, కారులో ఉన్న డిస్‌ప్లే చోరీ చేసిన సంఘటన బీచ్ రోడ్డులో చోటుచేసుకుంది. వివరాలివి.. బీచ్ రోడ్డు 8వ వార్డు గుడ్లవానిపాలెం ఓషన్ డ్రైవ్ లేఅవుట్‌కు చెందిన బీష్మారెడ్డి, సురేష్ ఇద్దరూ కారు డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పటిలాగానే విధులు ముగించుకుని మంగళవారం రాత్రి తమ ఇంటి సమీపంలో రహదారి వద్ద ఇద్దరి కార్లను పార్క్ చేశారు. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి కారు అద్దాలు పగలగొట్టి డిస్‌ప్లేలు చోరీ చేసినట్లు వారు తెలిపారు. వెంటనే ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు ఈ ప్రాంతం సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారన్నారు.

ఆదర్శనగర్‌లో అంధకారం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు ఆదర్శనగర్‌లో నెలరోజులుగా వీధిదీపాలు వెలగక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. శుభం-6 నుంచి లోపలికి వెళ్లే మార్గంలో చీకటి కారణంగా విషపురుగులు, దొంగల సంచారం ఎక్కువగా ఉందని స్థానికులు తెలిపారు. దీంతో చీకటి పడితే బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే జీవీఎంసీ స్పందించి వీధి దీపాలు పునరుద్ధరించాలని విశ్రాంత ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ముగిసిన శ్రీవిద్య ఉపాసన కోర్సు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో 7 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీవిద్య ఉపాసన అడ్వాన్స్‌డ్ కోర్సు బుధవారంతో ముగిసింది. దేశంలోని ముంబై, పూణే, హైదరాబాద్, ఢిల్లీ వంటి ప్రాంతాలతో పాటు యూఎస్ఏ, ఆస్ట్రేలియా, దుబాయ్, ఇటలీ, డెన్మార్క్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 24 మంది అభ్యాసకులు ఈ కోర్సులో శిక్షణ పొందారు. కోర్సులో భాగంగా దశ మహా విద్యలు, నవావరణ అర్చనలు, హోమ విధానాలు నేర్చుకున్నారని గురుమాత అన్నపూర్ణమ్మ వెల్లడించారు. గురుమాతతో పాటు ఆచార్యులు మూర్తి రాధ, కందర్ప రమలకు అభ్యాసకులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల ఆశలపై నీళ్లు



435 ఎకరాల్లో నువ్వుపంట వేసిన రైతులు ▪ ఎడతెరిపి లేని వర్షాలతో చేతికందని పంట

పెట్టుబడులు రావడమూ ప్రశ్నార్థకమే.. ▪ దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు



మద్దిలో పొలం మీద ఉన్న నువ్వు కట్టలు

పద్మనాభం: నువ్వు పంటను నమ్ముకున్న రైతుల ఆశలు అడియాసలయ్యాయి. 15 రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం వారిని నట్టేట ముంచింది. ఇక్కడి రైతులు తొలకరి పంటగా నువ్వు పంట వేస్తారు. ఈ పంట ఫలసాయం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఖరీఫ్‌లో వరి పంట వేయడానికి పెట్టుబడిగా పెట్టుకుంటారు. వర్షం వల్ల నువ్వు పంట పోవడంతో అన్నదాతలు వరిపంట సాగు చేయడానికి పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్ సీజన్ వస్తున్నా కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ఆర్థిక సాయం ఇంకా అందించలేదు. దీంతో ఒకవైపు పంట కోల్పోయి, మరోవైపు ప్రభుత్వ సాయం అందక అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఇదీ పరిస్థితి

పద్మనాభం మండలంలో 435 ఎకరాల్లో నువ్వు పంట వేశారు. మార్చి ఆఖరి వారంలో కృష్ణాపురం, మద్ది, తునిపాలెం, కురపల్లి, పాండ్రంగి, విలాస్కాన్‌పాలెం, గెద్దపేట, కోరాడ గ్రామాల్లో రైతులు ఈ పంట వేశారు. నువ్వు విత్తనాలు జల్లిన వెంటనే వర్షం కురవడంతో ఇవి మొలకెత్తకుండా పోయాయి. రైతన్నలు మళ్లీ రెండోసారి విత్తనాలు జల్లారు. విత్తనాలు వేసిన మూడు నెలలకు పంట పక్వానికి వస్తుంది. పంట పక్వానికి వచ్చే సమయంలో 15 రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. వర్షం వల్ల పంట పొలంలో నీరు నిల్వ ఉండటంతో కొంత పంట మొక్కల వేళ్లు కుళ్లిపోయి చనిపోయాయి. పొలంలో



మద్దిలో కాయలు లేని నువ్వు చేనును చూపిస్తున్న మహిళా రైతు

కోయకుండా ఉన్న నువ్వు పైరు కాయల్లోను నువ్వులను పక్షులు తినివేస్తున్నాయి. పక్షుల బారిన పడకుండా ఉండేందుకు తప్పని పరిస్థితుల్లో కొంత మంది నువ్వు చేను కోసి దిబ్బలు పెట్టారు. దిబ్బలు పెట్టి ఎక్కువ రోజులు కావడంతో మొలకలు మొలుస్తున్నాయి. మరి కొంతమంది కోత కోసిన నువ్వు చేనును కట్టలు కట్టి పొలంలో నిలబెట్టారు. వర్షం వల్ల నువ్వు కాయలు కుళ్లిపోయి నువ్వులు పురుగులు పట్టి పనికి రాకుండా పోయాయి. సాధారణంగా ఎకరం విస్తీర్ణంలో నాలుగు క్వింటాళ్ల వరకు దిగుబడి రావాలి. కాని వర్షం కురవడం వల్ల 50 కిలోలు కూడా దిగుబడి రాని పరిస్థితి. కనీసం పెటుబడులు కూడా రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వర్షం కురవడంతో మద్దిలో కోసిన నువ్వు చేనును దిబ్బలు పెడుతున్న రైతు

వర్షానికి పంట పోయింది



నేను ఎకరం విస్తీర్ణంలో నువ్వు పంట వేశాను. రూ.15వేల వరకు పెటుబడి పెట్టాను. పంట పక్వానికి వచ్చే సమయంలో వర్షం ప్రారంభమైంది. దీంతో నువ్వు మొక్కల వేళ్లు కుళ్లిపోయి అధిక శాతం పైరు చనిపోయింది. కొంత మేర ఉంది. 50 కిలోలు కూడా దిగుబడి వస్తుందో, లేదో తెలియదు. – ఎస్.చిన్న, కృష్ణాపురం

పెట్టుబడీ దక్కేలా లేదు



రెండెకరాల్లో నువ్వు పంట వేశాను. కాయలు లేవు. రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాను. కొంత మేర కాసిన కాయలు పనికి రాకుండా పోయాయి. పక్షులు కాయల్లోని గింజలను తినేశాయి. రెండెకరాల్లో ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి రావాలి. ఒక క్వింటా కూడా దిగుబడి రాదు. నువ్వు పంట ద్వారా వచ్చిన ఆదాయంతో ఖరీఫ్‌లో వరి పంటకు పెట్టుబడి పెడతాం. నువ్వు పంట పోవడంతో వరి పంటకు పెట్టుబడికి ఇబ్బందే. –బి.అప్పలనాయుడు, మద్ది

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: చిట్టివలస 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తగరపువలస, చిట్టివలస ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా తగరపువలస మెయిన్‌రోడ్డు, చిట్టివలస, శ్రీబాసర లే అవుట్, రామన్నపేట, కొత్తపేట, సంతపేట, కొండపేట, బంగ్లామెట్ట, చిట్టివలస జ్యూట్‌మిల్లు రోడ్డు, గణేష్ థియేటర్ రోడ్డు, సప్తగిరి లే అవుట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆనందపురం మండలంలో..

ఆనందపురం మండలం 33/11 కేవీ వెల్లంకి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బొడ్డపాలెం, వెల్లంకి రూరల్, వెల్లంకి ఇండస్ట్రియల్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా బొడ్డపాలెం, వెల్లంకి, గారిపేట, వెల్లంకి-2, మన్యాలపేట, అప్పన్న కాలనీ తదితర గృహ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సాగర్‌నగర్ పరిధిలో..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఏబీ నగర్, వైఎల్‌పీ లే అవుట్, సాగర్‌నగర్, ముసలయ్యపాలెం, గుడ్లవానిపాలెం, దసపల్లా లేఅవుట్, ఓషన్‌డ్రైవ్ లే అవుట్, శాంతినికేతన్ లేఅవుట్, రాజీవ్‌నగర్, ముబారక్ కాలనీ, గొల్లల ఎండాడ, తాటిచెట్లపాలెం, సుభాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అవయవదాత .. స్ఫూర్తి ప్రదాత

నొల్లి పరశురాం తల్లిదండ్రులకు సత్కారం

భీమునిపట్నం: అవయవదానం వల్ల మరికొందరికి ప్రాణదానం చేయవచ్చని ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యుడు ఫణికుమార్ అన్నారు. అవయవదానం వల్ల పలువురి జీవితాలకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ భీమిలి ఎగువపేట వద్ద అక్కడి యూత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ ప్రాంతానికి చెందిన నొల్లి పరశురాం అనే యువకుడు ఇటీవల పెయింటింగ్ పనులు చేస్తూ భవనంపై నుంచి పడి మరణించిన విషయం తెలిసిందే. అతడి స్నేహితుడు వాసుపల్లి శరత్ చంద్ర మృతుడి తల్లిదండ్రులు నొల్లి ధనరాజ్, లక్ష్మిలకు అవయవదానం గురించి తెలియజేయడంతో వారు ముందుకు వచ్చి తమ కుమారుడి అవయవాలను దానం చేశారు. ఈ సందర్భంగా పరశురాం తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కల్యాణి, యూత్ లీడర్ వాసుపల్లి అనిల్, మత్స్యకార నాయకుడు గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



అవయవదాత నొల్లి పరశురాం తల్లితండ్రులను సత్కరిస్తున్న యూత్ సభ్యులు

గంభీరంలో భూ కబ్జాలపై అధికారులు స్పందించరేం?

కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీలో ప్రభుత్వ భూములు, గెడ్డలు, చెరువులు కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడం లేదంటూ స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తూ, బుధవారం కలెక్టర్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. పూటకో కబ్జా, రోజుకో ఆక్రమణ జరుగుతున్నాయని, దీనిపై ఆనందపురం మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. పంచాయతీలో ముఖ్యంగా 3,4,5 వార్డులలో కబ్జాలు, అక్రమ కట్టడాలు జరుగుతున్నాయన్నారు. గంభీరం గ్రామ సచివాలయం ఎదురుగా గెడ్డను పూడ్చి ఆక్రమించినా తమకేమీ పట్టనట్టు వార్డు సభ్యులు, రెవెన్యూ అధికారులు చూస్తుండటంతో పంచాయతీలో అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందో తెలుస్తుందన్నారు. దీనిపై కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ జరిపించి, ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు.

రోడ్డు మధ్య విద్యుత్ స్తంభాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు విల్సన్‌పేటలో ఇళ్లముందు, సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ స్తంభాల కారణంగా గ్యాస్ రిక్షాలు, ఆటోలు ఇంటి ముందుకు రాలేని పరిస్థితి. దీంతో ఊరి చివర వరకు సామగ్రి, గ్యాస్ సిలిండర్లు కష్టపడి మోసుకుని రావలసి వస్తోందని స్థానికులు అంటున్నారు. అత్యవసర పరిస్థితులలో రోగులను ఆస్పత్రులకు తరలించాలన్నా కార్లు రావడం లేదని వాపోతున్నారు. జీవీఎంసీ జోక్యం చేసుకుని సీసీ రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తరలించాలని విల్సన్‌పేట వాసులు కోరుతున్నారు.



విల్సన్‌పేటలో సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు

నేడు సింహగిరిపై ఢిల్లీ విజయం

అప్పన్నకు నేడు తుదివిడత చందనం సమర్పణ

సింహాచలం: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సింహగిరిపై గురువారం ఢిల్లీ విజయం ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు వైదికులు ఏర్పాట్లు చేశారు. విశిష్టాద్వైత స్థాపకులు భగవత్ రామానుజాచార్యులు తన పాండిత్యంతో ఢిల్లీ బాద్‌షాని మెప్పించిన రోజు ఆషాఢ పౌర్ణమి కావడంతో ఏటా ఆరోజు శ్రీ వైష్ణవ ఆలయాల్లో ఢిల్లీ విజయం ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా ప్రముఖ శ్రీవైష్ణవ దేవాలయమైన సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఢిల్లీ విజయం ఉత్సవాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామివారి ఆలయంలో హంసమూలకు ఒక విశిష్టత ఉంది. అక్కడ భగవత్ రామానుజాచార్యుల విగ్రహం ఉంది. అక్కడ ఆయన్ని వేంజేపచేసి సాయంత్రం 4 నుంచి ఉత్సవాన్ని నిర్వహించారు. ఆయన వైభవాన్ని అర్చకులు కీర్తించి షోడషోపచార పూజలు నిర్వహిస్తారు. అలాగే ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం తెల్లవారుజామున స్వామికి తుదివిడతగా మూడు మణుగుల పచ్చిచందనాన్ని సమర్పిస్తారు. ఇప్పటికే సిద్ధం చేసిన చందనంలో బుధవారం అర్చకులు సుగంధ ద్రవ్యాలు కలిపి సమర్పణకు అనువుగా సిద్ధం చేశారు.



భగవత్ రామానుజాచార్యులు

13న ఎండాడలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

పార్టీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' అనే కార్యక్రమం ఈ నెల 13న ఎండాడ పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉదయం 10 గంటల నుంచి ఈ సమావేశం జరుగుతుందన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, విశాఖ పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు తదితరులు హాజరై, కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి మాట్లాడతారన్నారు. ఈ సమావేశానికి కార్పొరేటర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల, జీవీఎంసీ వార్డుల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు, జిల్లా, రాష్ట్ర నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని చిన్నశ్రీను ప్రకటనలో కోరారు.

నేడు మెగా పేరెంట్ టీచర్ సమావేశం

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గురువారం మెగా పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.రాంప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులు, సూచనలు, సలహాలు, అభిప్రాయాల గురించి చర్చించడం జరుగుతుందన్నారు.

సమ్మె విజయవంతం



అంబేడ్కర్ కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న సిటు కార్యకర్తలు

తగరపువలస: దేశంలోని వివిధ కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం చేపట్టిన అఖిల భారత పారిశ్రామిక సమ్మెను భీమిలి ఏరియా సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ, చిట్టివలస లేబర్ యూనియన్, చిట్టివలస ప్రాంత పెన్షనర్లు విజయవంతం చేశారు. ముఠా, స్కీమ్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులు, వివిధ కార్మిక సంఘాలు పాల్గొనగా, వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. సీఐటీయూ అనుబంధ సంఘాలు నిర్వహించిన ర్యాలీలో కార్పొరేటర్ బి.గంగారావు, భీమిలి నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు తదితరులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు, కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ ర్యాలీ

ఏఐటీయూసీ, అనుబంధ సంఘాలు చేపట్టిన ర్యాలీలో జిల్లా కార్యదర్శి పడాల గోవింద్, భీమిలి డివిజన్ కార్యదర్శి కొండపు ఈశ్వరరావు తదితరులు మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా చేసే చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పనిగంటల పెంపు కార్మికుల హక్కులను హరించడమేన్నారు. కార్మిక సంక్షేమ బోర్డుకు చైర్మన్, కమిటీ సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో మధురెడ్డి, రాంపైడి, తెడ్డు వెంకటేశ్వరరావు, పీ.సీత, లక్ష్మీపార్వతి, విజయభవాని పాల్గొన్నారు.



తగరపువలస వీధులలో ఏఐటీయూసీ ర్యాలీ

కనీస పెన్షన్ పెంచాలి

చిట్టివలస ప్రాంత పెన్షనర్ల సంఘం నిర్వహించిన ర్యాలీలో కనీస పెన్షన్ రూ.7500లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఒకపక్క పెరుగుతున్న ధరలతో అసంఘటిత రంగంలో పని చేసిన కార్మికులు రూ.1000 పెన్షన్‌తో ఏ విధంగా బతుకు ఈడ్చుకురాగలరని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్లకు హెల్త్‌కార్డులు, ప్రయాణాలలో రాయితీ ఇవ్వాలన్నారు. ఈ సమ్మెతో అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కావాలన్నారు. నిరసన కార్యక్రమంలో కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, సింగిడి అప్పారావు, మాదాబత్తుల అప్పలరాజు, గోక అప్పన్న, చిల్ల అప్పారావు, సన్నిబాబు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ జన్మదిన వేడుకలు



ఎంపీపీ రాంబాబును దుశ్శాలువాతో సన్మానించిన సిబ్బంది

పద్మనాభం: ఎంపీపీ కంటుబోతు రాంబాబు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన కేక్ కట్ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో మీనా కుమారి, సిబ్బంది రాంబాబును దుశ్శాలువాలతో సన్మానించారు. మద్దిలోని ఎంపీపీ ఇంటికి వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు వెళ్లి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డుపైకి ముళ్లపొదలు



కీతిన్‌పేట సమీపంలో రోడ్డుపైకి వచ్చిన ముళ్లపొదలు

భీమునిపట్నం: భీమిలి నుంచి తగరపువలస వెళ్లే మార్గంలో ఒకవైపు ముళ్లపొదలు రోడ్డుపైకి వస్తుండడంతో ఇబ్బందిగా మారుతోంది. ఈ మార్గంలో ప్రతిరోజు పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి, ఇందులో ద్విచక్రవాహనాలు ఆటోలు ఎక్కువ. ఐదు కిలోమీటర్ల ఈ మార్గంలో ఒకవైపు ముళ్లపొదలతోపాటు ఇతర మొక్కలు కూడా బాగా పెరిగిపోయాయి. అయితే పలు ప్రాంతాల్లో ఇవి రోడ్డుపైకి వచ్చేయడంతో సమస్యగా మారింది. దీనివల్ల ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారికి ముళ్లు గీరుకోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోల్లో వెళ్లేవారిలో పాదల వైపు కూర్చుని ప్రయాణించే వారికి కూడా ఇబ్బందికరంగా ఉంటోంది. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డ్రైనేజీల్లేక ఎక్కడి నీరు అక్కడే..

- వానొస్తే ముంపులోనే పాకలు
- సాధారణ రోజుల్లోనూ ఇళ్ల మధ్యే వాడుకనీరు
- తరచూ వ్యాధులు
- ఎస్సీ, బీసీ కాలనీవాసుల అవస్థలు



వర్షం వస్తే ముంపునకు గురవుతున్న పాకలు



ఇరువైపులా డ్రైనేజీల్లేని సీసీ రోడ్డు



కాల్వల నిర్మాణానికి తవ్వి వదిలేసిన పందలపాక బీసీ కాలనీ



డ్రైనేజీలు లేక నిలిచిన మురుగునీరు

తగరపువలస: సుమారు 200 కుటుంబాలు నివసించే ఆనందపురం మండలం పందలపాక పంచాయతీలోని బీసీ, ఎస్సీ కాలనీలో సైడ్ కాల్వలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఈ కాలనీలలో డ్రైనేజీలు నిర్మిస్తామని ఇంజినీరింగ్ విభాగం మొత్తం గోతులు తవ్వి వదిలేసింది. దీంతో వర్షాకాలంలో ఈ కాలనీ చెరువును తలపిస్తుంది. సాధారణ రోజుల్లో కూడా వాడుక నీరు బయటకు వెళ్లకపోవడంతో నివాసాల మధ్య నిలిచిపోతోంది. దీంతో దోమలు, ఈగల కారణంగా కాలనీవాసులు వ్యాధులబారిన పడుతున్నారు. కాలనీల ప్రజలంతా ఉపాధి, వ్యవసాయ కూలీలే కావడంతో ఆస్పత్రుల ఖర్చులు భరించలేకపోతున్నామని వాపోతున్నారు. అసలే వర్షాకాలం, వ్యాధులకు అవకాశం లేకుండా డ్రైనేజీలు నిర్మించి ఉపశమనం కల్పించాలని పందలపాక వాసులు కోరుతున్నారు.